నమస్తే తెలంగాణ

వరంగల్ హనుమకొండ

5 | మంగళవారం 23 ఏప్రిల్ 2024 | WARANGAL HANUMAKONDA


## తెలంగాణ గళం వినిపిస్తా.. మద్దతివ్వండి..

ఖిలావరంగల్ : ప్రజల మద్దతుతో వరంగల్ గడ్డపై బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తా. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూటకో మాట చెబుతూ రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతున్నాయి. రాష్ట్రానికి జరుగుతున్న తీవ్ర అన్యాయంపై ఒక దళమై.. ఒక బలమై తెలంగాణ గళాన్ని పార్లమెంట్‌లో వినిపించాల్సిన అవసరముంది. ఇందుకోసం ప్రజలు తమ పూర్తి మద్దతు తెలపాలి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, మామునూరు విమానాశ్రయం పునరుద్ధరణ సహా మూతపడిన అనేక పరిశ్రమలను తెరిపించేందుకు పోరాడుతా. అజాంజాహి మిల్లు మూతపడడం వల్ల ఇక్కడి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు కేసీఆర్ టెక్స్‌టైల్ పార్క్‌ను నిర్మించారు. భూపాలపల్లి జిల్లాలో బొగ్గు సంబంధిత పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తా. కేసీఆర్ ప్రభుత్వం హయంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారని, ప్రస్తుత ప్రభుత్వాలు సంక్షేమాలు గాలికొదిలేశారు. వరంగల్ ప్రజలు ఓటుతో కాంగ్రెస్, బీజేపీకి బుద్ధి చెప్పాలి. పోటీ చేస్తున్న అభ్యర్థుల చరిత్రను ప్రజలు ఒకసారి పరిశీలించాలి.

– బీఆర్ఎస్ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పక్కన హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రాజయ్య


నామినేషన్ వేసిన తర్వాత విజయ సంకేతం చూపుతున్న అభ్యర్థి సుధీర్‌కుమార్, ఎర్రబెల్లి, బండా ప్రకాశ్, బస్వరాజు సారయ్య, గండ్ర

# నామినేషన్ల జోరు..

**మంచి రోజు కావడంతో ఎక్కువ దాఖలైన నామినేషన్లు**

**వరంగల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్, కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య దాఖలు**

**మహబూబాబాద్‌లో బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్.. రెండు స్థానాలకు 14 నామినేషన్లు**

వరంగల్(నమస్తే తెలంగాణ)/మహబూబాబాద్, ఏప్రిల్ 22: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. సోమవారం మంచిరోజు కావడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో పది మంది, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో నలుగురు నామినేషన్లు దాఖలు చేశారు. వరంగల్ కలెక్టరేట్‌లో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ అభ్యర్థి మారెపల్లి సుధీర్ కుమార్ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి పీ ప్రావీణ్యకు అందజేశారు. అంతకుముందు పార్టీ శ్రేణులతో ర్యాలీగా వచ్చారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి వెంట ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య నామినేషన్ పత్రాలను ఆర్‌వోకు అందజేశారు. భూపాలపల్లి, వర్ధన్నపేట, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, కేఆర్ నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య ఆమె వెంట ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా తాళ్లపల్లి వెంకటయ్య, మంద నరేశ్, బొచ్చు రాజు, శనిగరపు రమేశ్‌బాబు, పోగుల అశోక్, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా ఇసంపల్లి వేణు, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా మేకల సుమన్, విదుథలై చిరుథైగల్ కట్చి పార్టీ అభ్యర్థిగా మచ్చ దేవేందర్ నామినేషన్ పత్రాలను ఆర్‌వోకు అందజేశారు. పది మంది పదకొండు సెట్లు దాఖలు చేశారు. నామినేషన్ల ప్రక్రియ 25వ తేదీ వరకు కొనసాగనుంది. ఇప్పటి వరకు మొత్తం 19మంది 22 సెట్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. కాగా, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి బీజేపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ సోమవారం మానుకోట కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి అద్వైత్ కుమార్ సింగ్‌కు నామినేషన్ పత్రాలను అందించారు. పాల్వంచ దుర్గ మరోసారి రెండు సెట్ల దాఖలు చేశారు. యూసీసీఆర్ఐఎంఎల్ పార్టీ అభ్యర్థిగా పగిడి ఎర్రయ్య, స్వతంత్ర అభ్యర్థిగా మైపతి అరుణ్‌కుమార్ నామినేషన్ వేశారు. ఇప్పటివరకు మొత్తం ఏడుగురు వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేశారు.


కలెక్టర్ ప్రావీణ్యకు నామినేషన్ పత్రం అందిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య



మహబూబాబాద్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్


బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ నామినేషన్ సందర్భంగా ర్యాలీలో పాల్గొని జైకొడుతున్న కార్యకర్తలు, అభిమానులు

### సీఎం రేవంత్ ఓ బ్రోకర్

- ఆగస్ట్ 15న రుణమాఫీ చేయకపోతే ప్రభుత్వాన్ని రద్దు చేస్తా అని రాసివ్వు
- నేడు వరంగల్, వర్ధన్నపేట సభలకు కేటీఆర్: ఎర్రబెల్లి
- గులాబీ శ్రేణులను టచ్ చేస్తే ఖబడ్దార్ : బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్
- వరంగల్‌పై గులాబీ జెండా ఎగరడం ఖాయం
- స్వార్థపరుడు అరూరి, మోసకారి కడియం
- నీతి, నిజాయితీపరుడు సుధీర్ కుమార్ : ఎమ్మెల్సీ సిరికొండ
- కడియం, రేవంత్‌రెడ్డి తోడు దొంగలు : మాజీ ఎమ్మెల్యే రాజయ్య

# 50వేల మెజార్టీతో సుధీర్ గెలుపు ఖాయం

### సుధీర్‌ను పార్లమెంట్‌కు పంపాలి : ఎర్రబెల్లి

ఖిలావరంగల్ :తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌తో పాటు 20 ఏళ్లు పోరాటం చేసిన వ్యక్తి డాక్టర్ సుధీర్ కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించి పార్లమెంటుకు పంపాలి. ఉన్నత విలువలతో కూడిన సుధీర్ కుమార్‌కు కేసీఆర్ వరంగల్ టికెట్ ఇవ్వడం సంతోషంగా ఉంది. అవతల పార్టీలో ఉన్న అభ్యర్థులు ప్రజలను ఎన్నిసార్లు మోసం చేశారో గుర్తుచేసుకోవాలి. మంచి చరిత్ర ఉన్న సుధీర్‌కుమార్ వ్యక్తిత్వాన్ని, ఉన్నత ఆశయాలను మేధావులు విశ్లేషణ చేసి ప్రజలకు తెలియచేయాలి. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల వల్లనే వరంగల్‌కు రావాల్సిన పరిశ్రమలు రాకుండా పోయాయి. కానీ కేసీఆర్ హయాంలోనే వరంగల్ జిల్లాకు న్యాయం జరిగింది. కడియం చాలా నీతిమంతుడని మాట్లాడుతున్నాడు, గతంలో ఆయన వివిధ సందర్భాల్లో మాట్లాడిన మాటలను తెలుసుకోవాలి. ప్రజలంతా సుధీర్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలి. నేడు వరంగల్, వర్ధన్నపేట సభలకు కేటీఆర్ హాజరవుతారు. 28న వరంగల్‌లో కేసీఆర్ రోడ్‌షో ఉంటుంది.

### సర్వేలన్నీ బీఆర్ఎస్‌కు అనుకూలమే

హనుమకొండ, ఏప్రిల్ 22 : బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్ 50వేల ఓట్ల మెజార్టీతో గెలవడం ఖాయమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. సర్వేలన్నీ వరంగల్‌లో బీఆర్ఎస్సే గెలుస్తుందని చెబుతున్నాయని పేర్కొన్నారు. సోమవారం బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ నామినేషన్ దాఖలు తర్వాత హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయం నుంచి ఏకశిల పార్కు వరకు భారీ ర్యాలీ నిర్వహించగా పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎర్రబెల్లి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఓ బ్రోకర్ అని, అతడిని ప్రజలెవరూ నమ్మరని విమర్శించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రజలకు, రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైన రేవంత్‌రెడ్డి ఆగస్టు 15లోగా రెండు లక్షల రుణమాఫీ చేస్తామని అంటున్నాడని, ఒకవేళ అప్పటి వరకు కూడా అమలుచేయకపోతే తన ప్రభుత్వాన్ని రద్దు చేయాలని గవర్నర్‌కు, రాష్ట్రపతికి బాండ్ పేపర్‌పై రాసి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### వరంగల్ సత్తా చూపాలి

వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంపై గులాబీ జెండా ఎగురడం ఖాయం. దక్షిణ భారతదేశంలోనే ధిక్కార స్వరానికి, పోరాటానికి మారుపేరు వరంగల్ గడ్డ. ఏ పార్టీలో ఉన్నా కడియం కుట్రలు, కుతంత్రాలు చేస్తారు. కేసీఆర్‌పై ఈగ వాలకుండా వరంగల్ సత్తా చూపించాలి. స్వార్థపరుడు అరూరి, మోసకారి, వెన్నుపోటుదారుడు కడియం శ్రీహరిని వరంగల్ ప్రజలు నమ్మరు. తెలంగాణ హక్కులు, ఆత్మగౌరవం కోసం పార్లమెంట్‌లో గొంతెత్తింది బీఆర్ఎస్ పార్టీయే. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తెలంగాణ రాష్ట్రంపై కుట్రలకు తెరలేపుతున్నారు. సన్నాయి నొక్కులు నొక్కుతున్న కడియం శ్రీహరి ఎన్నికల సందర్భంగా ఎన్ని డబ్బులు తెచ్చుకున్నాడో దేవుడిమీద ప్రమాణం చేయాలి. కడియం, అరూరి లాంటి వ్యక్తులను భూస్థాపితం చేయాలంటే వజ్రాయుధం లాంటి ఓటుతోనే సాధ్యం. త్వరలో వరంగల్ ప్రజలు వారికి బుద్ధి చెప్పడం ఖాయం.

– ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

### ద్రోహులే పార్టీ మారుతున్నారు..

బ్రోకర్లు, నమ్మకద్రోహులు మాత్రమే పార్టీని వీడుతున్నారు తప్ప కార్యకర్తలు వెళ్లడం లేదని ఎర్రబెల్లి అన్నారు. బీఆర్ఎస్ నుంచి లబ్ధిపొంది పార్టీ మారిన ఎమ్మెల్యే కడియం శ్రీహరికి బుద్ధి చెప్పాలన్నారు. కడియం, అరూరి లాంటి ద్రోహులను వరంగల్ ప్రజలు సహించరని పేర్కొన్నారు. కాంగ్రెస్‌ను గెలిపించి తప్పు చేశామని ప్రజలు బాధపడుతున్నారని పేర్కొన్నారు. శ్రీహరికి తాను రాజకీయ జీవితం ఇస్తే తనపైనే తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎలాంటి కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందని, కార్యకర్తలపై తప్పుడు పోలీస్ కేసులు పెడితే పోలీస్‌స్టేషన్ల ముందు బైఠాయిస్తామని తెలిపారు. సర్పంచ్‌లకు రావాల్సిన న్యాయమైన పెండింగ్ బిల్లులను పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఇప్పించేందుకు పోరాటం చేస్తానని చెప్పారు. సమావేశంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, నన్నపునేని నరేందర్, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు సుందర్‌రాజు యాదవ్, మర్రి యాదవరెడ్డి, పశ్చిమ నియోజకవర్గం కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, కార్పొరేటర్లు చెన్నం మధు, సోదా కిరణ్, మైనార్టీ నేత నయీముద్దీన్ పాల్గొన్నారు.

### భవిష్యత్ తరాలకు తెలిసేలా ప్రజాతీర్పు

'బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన ద్రోహులకు ఓటుతో బుద్ధి చెప్పాలి. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల్లో జోష్ పెరగడంతో పాటు పార్టీకి ద్రోహం చేసిన వారిని ఓడగొట్టాలనే కసి, పట్టుదల పెరిగింది.. ఇదే స్ఫూర్తితో వరంగల్ పార్లమెంట్‌పై గులాబీ జెండా ఎగురవేయాలి. రాబోవు తరాలకు ఇలాంటి నీచుల చరిత్ర ఉండేలా ప్రజాతీర్పు ఉండాలి. పార్టీ వీడిన వారు అవినీతిపరులు, అహంకారులు, వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్లు. ఎవ్వరైనా గులాబీ శ్రేణులను టచ్ చేస్తూ ఊరుకునే ప్రసక్తి లేదు.. ఖబడ్దార్.

– హనుమకొండ బీఆర్ఎస్ అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

### ఘన్‌పూర్ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా

స్టేషన్ ఘన్‌పూర్‌ను అభివృద్ధి నేనే చేశానంటున్న కడియం శ్రీహరి అభివృద్ధిపై అదే ఘన్‌పూర్‌లో రచ్చబండ చర్చకు సిద్ధమా. తెలంగాణ ద్రోహి, నమ్మకద్రోహి, కేసీఆర్‌ను బ్లాక్‌మెయిల్ చేసి బిడ్డకు ఎంపీ టికెట్ ఇప్పించుకొని పార్టీని మోసం చేశాడు. ఊసరవెల్లి రాజకీయాలు చేస్తూ అధికార దాహంతో కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచాడు. నీ రాజకీయ జీవితానికి ప్రజలు చరమగీతం పాడడం ఖాయం. ఆరు నెలల్లో కాంగ్రెస్ పార్టీ కూలిపోతుందని ఆ పార్టీలో చేరడం సిగ్గుచేటు. కడియం శ్రీహరిది భస్మాసుర హస్తం.. కడియంను పార్టీలోకి తీసుకొని రేవంత్‌రెడ్డి తన గోతిని తానే తవ్వుకున్నాడు.

– మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

## భువనగిరిలో క్యామ మల్లేశ్ నామినేషన్


కలెక్టర్‌కు నామినేషన్ పత్రం అందిస్తున్న క్యామ మల్లేశ్

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 22: భువనగిరి లోక్‌సభ నియోజకవర్గానికి భారత రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థి క్యామ మల్లేశ్ 3 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హనుమంతు కె. జెండగేకు సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, ఎలిమినేటి ఉమామాధవరెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్, బూడిద భిక్షమయ్యగౌడ్, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

## తస్లీమా ఇళ్లల్లో ఏసీబీ సోదాలు


**నెల క్రితం ఏసీబీకి చిక్కి సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్**

**ఐదు ఇళ్లు, 6 ప్లాట్లు, 3ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు గుర్తింపు**

**ఆస్తుల డాక్యుమెంట్లు, రూ. 1.92లక్షల నగదు స్వాధీనం**

**మొత్తం రూ. 2.94కోట్ల ఆస్తులు గుర్తించామని ఏసీబీ డీఎస్పీ సాంబయ్య వెల్లడి**

సుబేదారి, ఏప్రిల్ 22 : ఏసీబీ అధికారులకు పట్టుబడి సస్పెండ్ అయిన మహబుబాబాద్ జిల్లా సబ్ రిజిస్ట్రార్ మహ్మద్ తస్లీమా నివాసాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. రూ.2.94కోట్ల ఆస్తులు ఉన్నట్లు నిర్ధారించారు. సోమవారం వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య నేతృత్వంలో హనుమకొండలోని కాకతీయకాలనీ, యాదవనగర్‌లోని తస్లీమా ఇళ్లతో పాటు సూర్యాపేటలోని కుటుంబ సభ్యులు, భూపాలపల్లిలో డాక్యుమెంటరీ రైటర్స్ ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. తనిఖీల తర్వాత ఆస్తుల వివరాలను ఏసీబీ డీఎస్పీ వెల్లడించారు. ఐదు ఇళ్ల విలువ ప్రభుత్వ లెక్కల ప్రకారం రూ.27లక్షలు, ఆరు ఓపెన్ ప్లాట్ల విలువ రూ.12లక్షలు, మూడెకరాల వ్యవసాయ భూమి విలువ రూ.20.40లక్షల, వాహనాలు విలువ రూ.23.66లక్షలు, బ్యాంకు బ్యాలెన్స్ రూ.98,787, లభ్యమైన నగదు రూ.1,92,900.. మొత్తం ఆస్తుల విలువ రూ.2,94,00,547 ఉన్నట్లు ఏసీబీ అధికారులు నిర్ధారించారు. ఇంకా విచారణ కొనసాగుతున్నదని తెలిపారు.


హనుమకొండ కాకతీయ కాలనీలోని తస్లీమా నివాసంలో ఏసీబీ అధికారుల సోదాలు


బయ్యారంలో బలంగా వీచిన ఈదురు గాలులకు లేచిపోయిన రేకుల ఇండ్ల పై కప్పులు


గార్ల : మామిడి తోటలో రాలిన మామిడికాయలు

## మానుకోటలో వర్ష బీభత్సం

బయ్యారం/ గార్ల/ మహబూబాబాద్ రూరల్, డోర్నకల్/ కేసముద్రం, ఏప్రిల్ 20 : ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులతో ఆదివారం రాత్రి మహబూబాబాద్ జిల్లాలో వర్ష బీభత్సం సృష్టించింది. మహబూబాబాద్, బయ్యారం, గార్ల, డోర్నకల్ మండలాల్లో తీవ్ర ఆస్తి నష్టాన్ని మిగిల్చింది. పెద్ద పెద్ద వృక్షాలు నేలకూలాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. చేతికొచ్చిన పంటలు దెబ్బతిన్నాయి. బయ్యారం మండలంలో 34 విద్యుత్ స్తంభాలు విరిగి పడడంతోపాటు 11 కేవీ వైర్లు తెగిపోవడంతో 24 గంటలపాటు కరెంటు సరఫరా నిలిచి పోయింది. ఇటుక బట్టీల్లో ఇటుకలు తడిసి ముద్దయ్యాయి. డోర్నకల్ మండలం మన్నెగూడెంలో తేజావత్ నెహ్రూ చెందిన కోళ్లఫాం కూలి 2400 కోళ్లు మృతి చెందాయి. 45 బస్తాల దాణా తడిపోయింది. మొత్తంగా జిల్లాలో 1,873 ఎకరాల్లో మామిడి తోటలు దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు.

## భూపాలపల్లి గొంతెండుతోంది!

జయశంకర్ భూపాలపల్లి, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ) : భూపాలపల్లి జిల్లా కేంద్రంలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ఇప్పటికే ఖాళీ బిందెలతో జనం రోడ్డెక్కుతున్నారు. పట్టణంలోని ఆయా కాలనీలతో పాటు సింగరేణి కార్మిక కుటుంబాలకూ ఈ బాధలు తప్పడం లేదు. ఏప్రిల్‌లోనే ఇలా ఉంటే మేలో పరిస్థితి ఏంటని జనం ఆందోళన చెందుతున్నారు. నీటి సరఫరాలో అధికారులు విఫలమవుతున్నారని మండిపడుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో నీరు సమృద్ధిగా వచ్చేదని, మళ్లీ బిందెలతో రోడ్డెక్కడంతో పాతరోజులు గుర్తుకొస్తున్నాయని వాపోతున్నారు. సోమవారం పట్టణంలోని పైలట్‌కాలనీ సమీపంలోని సింగరేణి అధికారుల నివాసంలోని నల్లా వద్ద నుంచి, సబ్‌స్టేషన్‌లోని నల్లా నుంచి బిందెలతో నీళ్లు తెచ్చుకోవడం కనిపించింది. అలాగే మున్సిపల్ ట్యాంకర్ ద్వారా వచ్చే నీటిని బిందెలతో పట్టుకెళ్తున్నారు.


పైలట్‌కాలనీలో మున్సిపల్ ట్యాంకర్ ద్వారా నీటిని పట్టుకుంటున్న కార్మిక కుటుంబాలు

భూపాలపల్లిలోని పైలట్‌కాలనీలోని సింగరేణి అధికారుల నివాసం నుంచి నీటిని తెచ్చుకుంటున్న ప్రజలు

## కావ్యకు కార్యకర్తలు సపోర్ట్ చేయరు

- కాంగ్రెస్ పార్టీ అమ్ముడుబోయి ఆమెకు టికెట్ ఇచ్చింది
- కడియం శ్రీహరిది అధికార వ్యామోహం
- కాంగ్రెస్ కార్యకర్త, స్వతంత్ర అభ్యర్థి కృష్ణసాగర్


మాట్లాడుతున్న కాంగ్రెస్ కార్యకర్త కృష్ణసాగర్

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 22 : కాంగ్రెస్‌లో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న కార్యకర్తలకు గుర్తింపు లేదని, అసలైన నాయకులకు ఇవ్వాల్సిన వరంగల్ పార్లమెంట్ టికెట్‌ను కాంగ్రెస్ అమ్ముకుందని ఆ పార్టీ కార్యకర్త, ఇండిపెండెంట్ అభ్యర్థి శ్రీపెరంబుదూరి కృష్ణసాగర్ మండిపడ్డారు. సోమవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. వరంగల్ సీటును దొమ్మాటి సాంబయ్య, అద్దంకి దయాకర్ లేదా ఆరుసార్లు ఎమ్మెల్యేగా పని చేసిన మోత్కుపల్లి నరసింహులుకు కేటాయించాల్సి ఉండగా, కాంగ్రెస్ డబ్బులకు అమ్ముడుపోయి కడియం కావ్యకు కేటాయించిందని, ఆమెకు కార్యకర్తలు సపోర్టు చేయరన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరికి ఇంకా అధికార వ్యామోహం పోలేదని, కేవలం కూతురు రాజకీయ భవిష్యత్ కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరారన్నారు. కడియం శ్రీహరికి తన కూతురిపై ఉన్న ప్రేమ స్టేషన్‌ఘన్‌పూర్ ప్రజలు, కార్యకర్తల పైన లేదన్నారు.

కావ్యను ఓడించి ఇంటికి పంపే బాధ్యత తను తాను తీసుకుంటానన్నారు. మేధావులు, కవులు, కళాకారులు, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు.

## కాంగ్రెస్‌లో గ్రూపుల లొల్లి

**నేలపోగులలో ఇరువర్గాల మధ్య గొడవ**

లింగాలఘనపురం, ఏప్రిల్ 22 : కాంగ్రెస్‌లో గ్రూపు తగాదాలు మరోసారి భగ్గుమన్నాయి. తాజాగా సోమవారం మండలంలోని నేలపోగులలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఎంపీటీసీ గుగ్గిళ్ల నర్సయ్య అనుచరులు హల్‌చల్ చేశారు. గుగ్గిళ్ల నర్సయ్య కాంగ్రెస్ సాంస్కృతిక సేన రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. పార్టీలో చేరికల్లో దూసరి గణపతి వర్గాన్ని ఎలా తీసుకున్నారని నర్సయ్య వర్గీయులు నిలదీశారు. ఈ విషయమై గతంలోనూ గుర్తు చేశామంటూ సమావేశాన్ని బహిష్కరించారు. దీంతో మండల నాయకులు చేసేదేమి లేక సమావేశాన్ని అర్ధాంతరంగా ముగించడం విశేషం.


నేలపోగులలో గొడవపడుతున్న గుగ్గిళ్ల నర్సయ్య వర్గం